క్లుప్తంగా

నేడు 'కల్యాణలక్ష్మి' చెక్కుల పంపిణీ

ధన్వాడ: మండలానికి చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను శుక్రవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ నాగలక్ష్మి తెలిపారు. మొత్తం మండలంలో గురువారం వరకు 73 చెక్కులు వచ్చాయని, వీటిని ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించనున్నట్లు పేర్కొన్నారు.

'చేనేతబంధు' అందించాలి

ధన్వాడ: నేతన్నలకు చేనేత బంధు అందించాలని పద్మశాలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి కెంచె ఉదయభాను అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కులవృత్తుల వారికి ప్రభుత్వం అందజేయనున్న రూ.లక్ష ఆర్థికసాయం పథకంలో పద్మశాలీలకు చోటు కేటాయించకపోవడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. పద్మశాలీలు అన్ని కుల వృత్తుల వారి కన్నా వెనకబడిన వారని కనీస సహాయం రూ.లక్ష పథకంలోనూ స్థానం కల్పించకపోవడం సిగ్గుచేటన్నారు. వెంటనే పద్మశాలీలకు చేనేత బంధు పథకం కింద రూ.పది లక్షలు అందించాలని డిమాండ్ చేశారు.

బీసీల అభ్యున్నతికి కృషి

నారాయణపేట టౌన్: రాష్ట్రం బీసీ సేన సంఘం ఆధ్వర్యంలో జిల్లా, నియోజవర్గం కమిటీ నిర్ణయం మేరకు గురువారం జిల్లా కేంద్రంలో బీసీ సేన నియోజకవర్గ ఇన్‌చార్జీ దామరగిద్ద మండల అధ్యక్షుడిగా భాస్కర్ యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. తర్వలోనే నియోజవర్గ స్థాయి సమావేశంలో నియామక పత్రం అందిస్తామని నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీల అభ్యున్నతికి కృషి చేస్తామని తెలిపారు.

బస్ పాస్ కౌంటర్‌ను వినియోగించుకోవాలి

కోస్గి: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఈ నెల 12 నుంచి ఏర్పాటు చేయనున్న బస్ పాస్ కౌంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ ఆంజనేయులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ బస్ పాస్ కేంద్రంలో విద్యార్థుల ఉచిత పాసులు, వికలాంగులకు ఇచ్చే 50 శాతం రాయితీ పాసులు, సీజనల్ టికెట్లు, అన్ని రకాల బస్ పాసులు ఇస్తారని పేర్కొన్నారు. వివరాలకు బస్ పాస్ కౌంటర్ ఇన్‌చార్జ్ వెంకటేష్‌ను సెల్: 6305109009 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

రేపు లోక్ అదాలత్

కోస్గి: ఈ నెల 10న లోక్ అదాలత్ నిర్వహిస్తునట్లు సీఐ జనార్దన్ గౌడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లోక్ అదాలత్‌లో ఎలాంటి అప్పీల్ లేకుండానే ఇరు వర్గాలు రాజీ పడితే కేసులు ఎత్తివేస్తారన్నారు. ఆర్థిక లావాదేవీలు, బీమా, భూ తగాదాలు, డ్రంకెన్ డ్రైవ్, అత్తింటి వేధింపులు, మనోవర్తితోపాటు చట్టరిత్యా రాజీకి అర్హత ఉన్న కేసుల్లో పైసా ఖర్చు లేకుండా పరిష్కరించుకోవచ్చన్నారు. కోస్గి సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్‌లలో నమోదైన కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవాలని కోరారు.

ఉత్సవాల పేరుతో రూ.కోట్లు వృథా

దామరగిద్ద: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రభుత్వం రూ.కోట్ల నిధులను కేటాయించి ప్రజా దనాన్ని వృథా చేస్తుందని కందెన్‌పల్లి ఎంపీటీసీ, బీజేపీ నాయకుడు అంజిలయ్యగౌడ్ ఆరోపించారు. చెరువులు మరమ్మతు లేకుండా చెరువు కట్టలపై ఉత్సవాలు జరపుకోవడం సిగ్గు చేటని ఎద్దేవా చేశారు. రైతులకు ఐదేళ్ల క్రితం ఎన్నికల సమయంలో ఇచ్చిన రుణమాఫీ, దళితులకు మూడెకరాల హామీ ఏమైందన్నారు. శాసనసభ ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రజలను పక్కదారి పట్టించేందుకు ఉత్సవాలను నిర్వహిస్తున్నారని మండిపడ్డారు.

పింఛన్ చెల్లింపులో జాప్యం వద్దు



నారాయణపేట రూరల్: జిల్లా రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు గురువారం ట్రెజరీ అధికారి యాదగిరిని కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు సరైన సమయానికి పెన్షన్ అందడం లేదని, దీంతో ఎంతో మంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. ముఖ్యంగా అనారోగ్యంతో బాధపడుతున్న వారికి అవసరమైన మందుల కొనుగోలు, ఇతర ఖర్చులకు ఈ డబ్బులే ప్రధాన ఆధారం కావడంతో ఆలస్యం చేయడంతో ఆవేదన చెందుతున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మనోహర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్, కోషాదికారి సత్యనారాయణ, బాలరాజు, నారాయణ, లక్ష్మయ్య పాల్గొన్నారు.



మోమినాపూర్‌లో చెరువు వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి



ఊట్కూరు పెద్ద చెరువు వద్ద సంబరాల్లో పాల్గొన్న ఎంపీపీ, జెడ్పీటీసీ



రామకిష్టాయిపల్లిలో బతుకమ్మతో వెళ్తున్న మహిళలు

ఘనంగా చెరువుల పండగ

మక్తల్: మండలంలోని మంతన్‌గోడ్, మాద్వార్, సంగంబండ, భూత్పూర్, జక్లేర్, పస్పుల, కర్ని, గుడిగండ్ల, కాచ్‌వార్, బోదల్‌కుంట, గ్రామాల్లో గురువారం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చెరువుల పండగను నిర్వహించారు. మంతన్‌గోడ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెడ్పీ పర్సన్ వనజమ్మ హాజరై మాట్లాడారు. చెరువులకు పూడికతీత తీసి భూగర్భ జలాలు పెంచిన ఘటన బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. మున్సిపాలిటీ కేంద్రంలో ట్యాంకు బండ్ దగ్గర అయా కాలనీ ప్రజలు చెరువు వద్దకు చేరుకొని ఈదమ్మ దేవతలకు పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వనజ, ప్రత్యేక అధికారి జాన్‌సుధాకర్, మున్సిపల్ చైర్ పర్సన్ పావనీ, వైస్ చైర్మన్ అకిలారెడ్డి, ఎంపిడిఓ శ్రీదర్, ఎంపిఓ పావనీ,మంతన్‌గోడ్ పసర్పంచు కృష్ణయ్యగౌడ్, కౌన్సిలర్ అనంపల్లి కొండయ్య, కమిషనర్ మల్లికార్జున్, సర్పంచులు మహదేవమ్మ, లక్ష్మమ్మ, దత్తు, నర్సిములు, వెంకటేశ్, కుర్వ హన్మంతు, శేఖర్‌రెడ్డి, పాల్గొన్నారు.

మద్దూరు: తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక చెరువులు అభివృద్ధి చెందాయని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మోమినాపూర్ చెరువు వరకు బతుకమ్మలతో ఊరేగింపుగా వెళ్లారు. మహిళలతో కలిసి ఎమ్మెల్యే బతుకమ్మ ఆడారు. అదే విధంగా మద్దూరులో దశాబ్ది ఉత్సవాల సందర్భంగా బతుకమ్మ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం మండలంలోని మోమినాపూర్‌లో ఉన్నత పాఠశాలలో ప్రయోగశాలను, ఐమాక్స్ లైట్లను ప్రారంభించారు. అదేవిధంగా వాటర్ ట్యాంకు ప్రారంభించి, ఉపాధి నిధులతో చేపట్టే పంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో డీఎఫ్ఓ వీణావాణీ, ఎంపీడీఓ విజయలక్ష్మి, ఆయా గ్రామాల సర్పంచ్‌లో గోవర్దన్, ఆరుణ, ఏఎంసీ చైర్మన్ వీరారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జగదీశ్వర్, బీఆర్ఎస్ నాయకులు బాల్‌సింగ్‌నాయక్, వెంకటయ్య, హన్మిరెడ్డి, వెంకట్‌రాములుగౌడ్, చంద్రశేఖర్, విజయభాస్కర్‌రెడ్డి, చెన్నారెడ్డి, బసప్ప, తదితరులు పాల్గొన్నారు.

నర్వ: మండలంలోని కొత్తపల్లిలో చెరువుల పండుగను నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు చెరువకు పూజలు చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మాగనూర్: దశాబ్ది ఉత్సవాలల్లో భాగంగా గురువారం నిర్వహించిన ఊరూరా చెరువుల పండుగా మండలం వ్యాప్తంగా నిర్వహించారు. గ్రామాల్లో పండుగా వాతావరణం కనిపించింది. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీడీఓ, ఎంపీఓ, మండల స్పెషల్ అధికారి తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలోని మల్లెపల్లి, పులిమామిడి, బిజ్వార్, ఎడివెల్లి, పెద్దజట్రం తదితర గ్రామాలలో చెరువుల పండుగను నిర్వహించారు. మహిళలు బతుకమ్మలను ఎత్తుకొని ఊరేగింపుగా చెరువు వద్దకు చేరుకున్నారు. చెరువుగట్టుపై మహిళలు బతుకమ్మ పాటలు పాడుతూ ఆటలు ఆడారు. అనంతరం వనబోజనాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎల్కోటి లక్ష్మి, జెడ్పీటీసీ అశోక్‌కుమార్‌గౌడ్, ఎంపీడీఓ కాలప్ప, తహసీల్దార్ తిరుపతయ్య, ఏపీఎం నిర్మల, సర్పంచ్‌లు సూర్యప్రకాష్‌రెడ్డి, సావిత్రమ్మ, యశోదమ్మ, మాణిక్యమ్మ, రవిందర్‌రెడ్డి, కత్తలప్ప, సులోచనమ్మ తదితరులు పాల్గొన్నారు.

ధన్వాడ: దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని గురువారం మండలంలోని అన్ని గ్రామాల్లో చెరువుల పండగను ఘనంగా నిర్వహించారు. హన్మన్‌పల్లిలో సర్పంచ్ గోవింద్‌నాయక్ అధ్యక్షతన ఉదయం మహిళలు బతుకమ్మతో ర్యాలీగా చెరువు వద్దకు చేరుకొని బతుకమ్మ ఆడారు. ధన్వాడలో సర్పంచ్ అమరేందర్‌రెడ్డి అధ్యక్షత పెద్ద చెరువులో ఉత్సవాలు నిర్వహించి రైతులకు, గ్రామస్తులకు భోజనం ఏర్పాటు చేశారు. అలాగే మంత్రోనిపల్లిలో సర్పంచ్ శాంతమ్మ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు.



మాగనూరులోని బైరంపల్లిలో..

కోస్గి: దశాబ్ది ఉత్సవాల సందర్భంగా గురువారం నిర్వహించిన చెరువుల పండుగ వేడుకల్లో ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు. మున్సిపల్ పరిధిలోని బండం చెరువు దగ్గర, కొత్త మండలం గుండుమాల్‌లో నిర్వహించిన వేడుకలు ఎంతగానో అలరించాయి. మహిళలు బోనాలతో, బతుకమ్మలతో ర్యాలీగా చెరువు గట్టు పైకి చేరుకొని ఆడిపాడారు. బోగారం, ముంగిమళ్ళతో పాటు పలు గ్రామాల్లో చెరువుల పండుగ వేడుకలు నిర్వహించారు. శ్యాసం రామకృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ భీంరెడ్డి, వైస్ చైర్మన్ వేణుగోపాల్, కౌన్సిలర్లు బాలేష్, మాస్టర్ శ్రీను, బందెప్ప, పలువురు పాల్గొన్నారు.

సాగునీటిది వొడవని ముచ్చట్లు..

నారాయణపేట రూరల్: ఉమ్మడి రాష్ట్రంలో నిర్లక్ష్యానికి గురైన చెరువులకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుతోనే పండుగ వాతావరణం ఏర్పడిందని ఎంపీపీ అమ్మకోళ్ల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని కోటకొండ, కొల్లంపల్లి, జాజాపూర్, చిన్నజట్రం, అప్పిరెడ్డిపల్లి, బొమ్మన్‌పాడు, తిర్మలాపూర్, సింగారం తదితర గ్రామాల్లో పర్యటించి చెరువులకు పూజలు చేసి చేపలను మత్స్యకారుకులకు అందించారు. అంతకుముందు బోనాలు, బతుకమ్మలతో గ్రామ పురవీధుల గుండా ర్యాలీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అంజలి, బీఆర్ఎస్ అధ్యక్షుడు వేపూరి రాములు, వైస్ ఎంపీపీ సుగుణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మరికల్: దశాబ్ది ఉత్సవాల సందర్భంగా మండలంలో గురువారం ఘనంగా చెరువుల పండగను జరుపుకొన్నారు. మండలంలో పలు గ్రామాల్లో బతుకమ్మలు, బోనాల డప్పులతో ఊరేగింపుగా వెళ్లి చెరువుల ఆనకట్టలపై వెలసిన దేవతలకు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలను సమర్పించారు. అనంతరం బతుకమ్మలను చెరువులో వదిలారు. అక్కడే వంటావార్పు చేసి రైతులకు భోజనాలు వడ్డించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ యశోదమ్మ, ఎంపీఓ బాలాజీ, సర్పంచులు గోవర్ధన్, శ్రీనివాస్‌రెడ్డి, దేవమ్మ, పుణ్యశీల, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

దామరగిద్ద: మండల కేంద్రంతో పాటు కాన్‌కుర్తి, పిడెంపల్లి, మల్‌రెడ్డిపల్లి, క్యాతన్‌పల్లి, మొగుల్‌మడ్క తదితర అన్ని గ్రామాల చెరువు గట్లపై మన ఊరు మన చెరువు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కట్టమైసమ్మలకు ప్రత్యేక బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం సహాపంక్తి భోజనాలు చేశారు.



వెంకటాపూర్‌లో..



కోటకొండలో..



మరికల్‌లో పెద్ద చెరువు కట్టపై వంటలు చేస్తున్న సర్పంచ్



కొల్లంపల్లిలో మత్స్య కార్మికులకు చేపలను అందిస్తున్న ఎంపీపీ



గడిమున్కన్‌పల్లిలో చెరువు కట్టపై సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్

బడిలో చేరిన చిన్నారులు



ఊట్కూరు: మండలంలోని ఓబులాపూర్‌లో ఉపాధ్యాయులు గురువారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 10 మంది చిన్నారులను పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గురునాథ్, చక్రవేణి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

నేతన్నలను విస్మరించడం సరికాదు

నారాయణపేట రూరల్: బీసీ వర్గాల్లోని వివిధ కుల వృత్తులకు రూ.లక్ష ఆర్థికసాయం ప్రకటించడాన్ని బీజేపీ స్వాగతిస్తుందని, అందులో చేనేత కార్మికులను విస్మరించడం సరికాదని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, చేనేత సహకార సంఘం అధ్యక్షుడు పగడాకుల శ్రీనివాసులు విమర్శించారు. తొలి విడతలో 15 కులాలకు అందిస్తున్నట్లు చెప్పి నేతన్నలపై టీఆర్ఎస్ ప్రభుత్వం చిన్నచూపు చూశారని దుయ్యబట్టారు. సిరిసిల్లతో పాటు, మునుగోడులో సైతం చేనేత కార్మికుల ఓట్లతో గెలిచి నేడు అన్యాయం చేశారని దుయ్యబట్టారు. తెలంగాణ ఆవిర్భావం నుంచి సహకార సంఘం ఎన్నికలు జరపలేదని, నిర్వీర్యం చేయడానికే కేసీఆర్ పథకం వేస్తున్నారని విమర్శించారు. వెంటనే నేతన్నలపై తమ చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు.

ట్రాక్టర్ పట్టివేత

మాగనూర్: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను వీఆర్ఏ సందీప్ గురువారం పట్టుకున్నారు. స్థానిక ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని అచ్చంపేట గ్రామానికి చెందిన రంగప్ప మండల కేంద్రంలోని పెద్దవాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా అచ్చంపేట గ్రామానికి ఇసుకను తరలిస్తున్నాడు. విషయం తెలుసుకున్న వీఆర్ఏ ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ట్రాక్టర్ యాజమానిపై కేసు నమోదు చేసినట్లు దీనిపై ఎస్ఐ నరేందర్ తెలిపారు.



మద్యం తాగి వాహనాలు నడపొద్దు

నారాయణపేట రూరల్: మద్యం తాగి వాహనాలు నడపొద్దని పోలీసులు సూచించారు. వాహన డ్రైవర్లకు గురువారం సాయంత్రం స్థానిక వీర్ సావర్కర్ చౌరస్తాలో ట్రాఫిక్ పోలీసులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కానిస్టేబుల్ తిరుపతి మాట్లాడుతూ.. ద్విచక్రవాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, ఫోర్ వీలర్స్ డ్రైవర్లు సీటు బెల్ట్ పెట్టుకొని డ్రైవింగ్ చేయాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే జరిమానా, జైలు శిక్ష ఉంటుందన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఆటో, ట్యాక్సీ డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను తీసుకొని వెళ్లరాదన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, సీబుక్, పొల్యూషన్ తదితర పత్రాలను వెంట తెచ్చుకోవాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడపరాదని, త్రిబుల్ రైడింగ్ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

భార్యాభర్తల అవయవ దానం



అవయవాలు దానం చేసిన ధ్రువపత్రాలను చూపిస్తున్న భార్యాభర్తలు

మరికల్: మండలంలోని అప్పంపల్లికి చెందిన అనిల్‌కుమార్‌రెడ్డి దంపతులు అవయవదానానికి సిద్ధపడ్డారు. గురువారం అనిల్‌కుమార్‌రెడ్డి పుట్టినరోజు కావడంతో ఆయన తనభార్య కళ్యాణితో కలిసి, హైదరాబాద్‌లోని అమ్మ ఐ ఆర్గాన్ బాడీ డొనేషన్ ప్రమోటర్స్ ఆర్గనైజేషన్ అనే సంస్థ కార్యాలయానికి వెళ్లారు. ఈ మేరకు ధ్రువీకరణ పత్రాలు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో శారద, జనశక్తి వ్యవస్థాపకులు లలిత్‌కుమార్, కృష్ణ ధర్మరక్షణ వ్యవస్థాపకులు కెల్లా దుర్గరావు, నాగేష్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

మక్తల్: పట్టణంలోని సీయూపీఎస్ పాఠశాలలో 1996–1997 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు గురువారం పూర్వ విద్యార్థల సమ్మేళనం నిర్వహించారు. అప్పటి గురువులు బీమాచారీ, అరుణ, గురురాజారావులను సన్మానించారు. పూర్వ విద్యార్థులు ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని ప్రస్తుతం చేస్తున్న పని, కుటుంబసభ్యుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో గడిపిన క్షణాలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మల్లేశ్, ఆనంద్, వెంకటేశ్, హర్షవర్ధన్‌రెడ్డి, కురుమూర్తి, శివశంకర్, శ్రీవాణి, నాగరాజు, వాబయ్య, అశోక్, నీలి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో..

ఆత్మకూర్: ద్విచక్ర వాహనాన్ని తుఫాన్ వాహనం ఢీకొట్టడంతో వ్యక్తి తీవ్ర గాయాలైన ఘటన గురువారం రాత్రి పిన్నంచర్లలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గద్వాల జిల్లా ధరూర్‌కు చెందిన నాగేంద్రం ద్విచక్రవాహనంపై ఆత్మకూర్ వస్తుండగా పిన్నంచర్ల సమీపంలో ఎదురుగా వస్తున్న తుఫాన్ వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు.

మండలంగా ప్రకటించే వరకు ఉద్యమం



మాట్లాడుతున్న రాము

నారాయణపేట రూరల్: కోటకొండ మండల సాధన సమితి ఆధ్వర్యంలో చేపడుతున్న నిరాహారదీక్షలు 30వ రోజుకు చేరుకున్నాయి. గురువారం మైనార్టీ యూత్ సంఘం సభ్యులు దీక్షలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా సాధన సమితి నాయకుడు రాము మాట్లాడుతూ.. కోటకొండను మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అన్ని అర్హతలు కలిగి ఉన్నా రాజకీయ దురుద్దేశంతోనే టీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. స్థానిక నాయకులు, ఈ ప్రాంత ఎమ్మెల్యే చొరవ తీసుకుని సీఎం కేసీఆర్‌తో ప్రకటన ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో కెంచె శ్రీనివాసులు, యాదగిరి, కాశీనాథ్, చెన్నప్ప, సర్పంచ్ విజయలక్ష్మి, నాయకులు సలీం, హాజిమలాంగ్, రహమాన్, సులెమాన్, అఫ్రిద్, నయూం, పాషా, యాసిన్, అబ్బాస్, రహ్మన్, ఆదాన్ పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షలపై దృష్టి పెట్టండి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్: ప్రజల ఆకాంక్షలు నెరవేర్చకుండా ప్రభుత్వం సంబరాలు జరపడం విడ్డూరంగా ఉందని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకులు నర్సింహులు విమర్శించారు. గురువారం దీక్ష దివాస్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని శ్యాసన్‌పల్లిలో పర్యటించి కరపత్రాలు పంచి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీకి బలం పెంచుకోవడం కోసం అధికారిక సభల పేరుతో ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని దుయ్యబట్టారు. మిగులు రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని, ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు పూర్తిగా వ్యతిరేకంగా మారారని అన్నారు. కార్యక్రమంలో మంజుల, మణెమ్మ, భరతమ్మ, వెంకటయ్య, గోవిందమ్మ, శాంతమ్మ, చెన్నమ్మ, లక్ష్మి, రవి, బస్సప్ప, రాము, రాజు పాల్గొన్నారు.

రేపు బీజేపీ మోర్చాల సమావేశం

నారాయణపేట రూరల్: భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఏడు మోర్చాలకు సంబంధించిన సమావేశం శనివారం ఉదయం 10గంటలకు నిర్వహిస్తున్నట్లు జిల్లా సెక్రెటరీ ప్రభాకరవర్ధన్ తెలిపారు. ఆయా మోర్చాలకు సంబంధించి జిల్లా, మండల బాధ్యులు విధిగా పార్టీ కార్యాలయంలో సమావేశానికి హాజరు కావాలన్నారు. రాష్ట్ర నాయకులు నాగురావునామాజీ, రతంగపాండురెడ్డి హాజరై దిశానిర్దేశం చేస్తారని చెప్పారు.

రోడ్డు కబ్జా చేసిన వ్యక్తిపై చర్య తీసుకోండి

అమరచింత: మండలంలోని కొంకన్‌వానిపల్లి గ్రామం మీదుగా మద్దూరు వరకు ఉన్న లింకు రోడ్డును కబ్జా చేసిన రైతు సద్దల బాలకృష్ణారెడ్డిపై చర్యలు తీసుకోవాలని గురువారం కొంకన్‌వానిపల్లి సర్పంచ్ వెంకటన్నతో కలిసి గ్రామస్తులు ఆందోళన నిర్వహించారు. కొన్నేళ్లుగా తమ గ్రామం నుంచి చిన్నచింతకుంట మండలం మద్దూరు గ్రామానికి రహదారి ఉందని సర్పంచ్ వెంకటన్న తెలిపారు. సద్దల బాలకృష్ణారెడ్డి అనే రైతు తన వ్యవసాయ పొలం సమీపంలో ఉన్న రోడ్డును జేసీడీతో పూడ్చి ఆక్రమించుకున్నారని ఆరోపించారు. రెండు గ్రామాలకు రాకపోకలకు ఇబ్బందిగా మారుతుందని, రహదారిని ఆక్రమించిన వ్యక్తిపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రహదారిని ఆక్రమించిన వ్యక్తి గురించి మద్దూరు సర్పంచ్‌కు విన్నవిస్తామని అక్కడ సమస్య పరిష్కారం కాకపోతే తహసీల్దార్‌కు రోడ్డు ఆక్రమణపై ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో రమేష్, వెంకటేష్, అంజి పాల్గొన్నారు.

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

ఆత్మకూర్: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్‌కు దీటుగా విద్యా బోధన చేపడుతున్నామని ఎంఈఓ భాస్కర్‌సింగ్, సీఆర్పీ సౌమ్యరాణి అన్నారు. గురువారం విద్యాశాఖ ఆదేశాల మేరకు మండలంలోని గ్రామాల్లో బడి బయటి విద్యార్థుల వివరాలను నమోదును ముమ్మరంగా చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాలలకు రాకుండా బడి బయట ఉన్న వారు 42 మంది చిన్నారులను గుర్తించామని తెలిపారు.